సాక్షి మంచిర్యాల

బుధవారం । 10 । జూలై । 2024



గోరింటా పండింది..!

8లో▸

ఆషాఢ మాసం వచ్చిందంటేనే మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతుంటాయి. ఈ మాసంలో గోరింటాకు రోగ నిరోధకంగా పనిచేస్తుంది.



చీతా కన్నుమూత

8లో▸

నేరస్తుల పాలిట సింహస్వప్నంగా మారిన అటవీశాఖకు చెందన చీతా డాగ్‌స్క్వాడ్ మరణించింది. రేంజ్ అధికారి సుష్మారావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /27.1

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. తుపాను ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయి.

గురువులకు వీడ్కోలు



చెన్నూర్: పట్టణంలోని ఎనగుట్ట(ఎమ్మెల్యే) కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించిన హెచ్‌ఎం పుట్ట శ్రీనివాస్, ఉపాధ్యాయుడు సిరంగి పవన్‌కుమార్ ఇటీవల మంచిర్యాలకు బదిలీ అయ్యారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుడికి కాలనీవాసులు మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం పాఠశాలను వీడుతున్న ఉపాధ్యాయులను విద్యార్థులు చుట్టుముట్టారు. తమ పాఠశాలలోనే ఉండాలని పట్టుబట్టారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు నచ్చజెప్పారు. అనంతరం విద్యార్థులు కన్నీటితోనే వారిని సాగనంపారు. వీడ్కోలు సమావేశంలో ఎంఈవో రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

దండేపల్లి మండలం కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో 5 తరగతులు ఉన్నాయి. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే పాఠశాలలో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు. అందరికీ అతనే పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులను తరగతి గదులవారీగా కాకుండా అందరినీ ఒకేచోట కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. మొన్నటి వరకు పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల ఒకరు పదోన్నతి, బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుడికి కూడా బదిలీ అయింది. కానీ, కొండాపూర్ పాఠశాలను ఎంచుకున్న ఉపాధ్యాయులు రాకపోవడంతో రిలీవ్ కావడం లేదు. - దండేపల్లి



న్యూస్‌రీల్

సమయపాలన పాటించని ఉపాధ్యాయులకు నోటీసులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీతారాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో షోకాజు నోటీసులు జారీ చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మంగళవారం జెడ్పీహెచ్ఎస్‌తోపాటు ప్రైమరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్‌లో ఆరుగురు ఉపాధ్యాయులు నిర్ణీత సమయానికి రాలేదు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉపాధ్యాయులు తప్పని సరిగా సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎఫ్‌సెట్ కౌన్సెలింగ్‌కు 452 మంది హాజరు



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎఫ్‌సెట్ -2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు స్లాట్ బుక్ చేసుకున్న 452 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. తర్వాత సర్టిఫికెట్లు పరిశీలించారని ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్‌రెడ్డి తెలిపారు.

పాలిసెట్ కౌన్సెలింగ్..

పాలిసెట్ -2024 సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ మంగళవారం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగింది. హెల్ప్‌లైన్ సెంటర్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 53 మంది విద్యార్థులు హాజరయ్యారు. కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా జరిగినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వృత్తిశిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో వృత్తి శిక్షణ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏరియా డీజీఎం పర్సనల్ అరవిందరావు తెలిపారు. 2024–25 సంవత్సరానికి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో టైలరింగ్, మగ్గం వర్క్, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్‌బ్యాగుల తయారీ, కంప్యూటర్స్ డీటీపీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కంపెనీ ఉద్యోగుల కుటుంబాల్లోని మహిళలు, సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని మహిళలు ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 20వ తేదీలోగా జీఎం కార్యాలయలంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిపుణులతో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు.

నిలిచిన న్యూట్రిషన్

- మూడు నెలలుగా కిట్ల సరఫరా బంద్
- ప్రభుత్వం మారిన తర్వాత మూడు నెలలు సరఫరా
- ప్రస్తుతం నిలిపివేత.. కొనసాగింపుపై రాని స్పష్టత



న్యూట్రిషన్ కిట్‌లో ఉన్న వస్తువులు ఇవే

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్ల పంపిణీ నిలిచిపోయింది. కిట్ల సరఫరాను మూడు నెలలుగా నిలిపివేయడంతో గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదు. మాతాశిశు మరణాలను తగ్గించడంతో పాటు, సాధారణ ప్రసవాలు పెంచాలని గత ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీని ప్రారంభించింది. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. తర్వాత మూడు నెలలపాటు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత నిలిపివేశారు. పౌష్టికాహారం కిట్ల కోసం గర్భిణులు వైద్యులు సంప్రదించగా ఎప్పుడు వస్తాయో చెప్పడం లేదు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు సైతం న్యూట్రిషన్ కిట్లను సరఫరా చేశారు. తర్వాత పూర్తిగా నిలిపివేసి, కేవలం మాతాశిశు ఆస్పత్రులకు మాత్రమే కిట్లు సరఫరా చేశారు. మూడు నెలలుగా అవికూడా సరఫరా చేయడం లేదు.

ప్రతీ గర్భిణికి రెండుసార్లు..

గర్భిణుల్లో పౌష్టికాహార లోపం నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రసవం వరకు రెండుసార్లు న్యూట్రిషన్ కిట్లు అందించేది. తద్వారా గర్భిణుల్లో రక్తహీనత నివారణ, మాతా శిశు మరణాల రేటును తగ్గుతుందని, ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు పెరుగుతాయని ప్రభుత్వం భావించింది. పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికే వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు 12 నుంచి 26 వారాల్లోపు గర్భిణులకు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే అందించారు. రెండో కిట్‌ను ప్రసవం కోసం వెళ్లే కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రాల్లో 24 నుంచి 34 వారాల్లోపు గర్భిణులు చెకప్ కోసం వెళ్లినప్పుడు అందించారు.

కిట్లలో ఇవీ..

మొదటి కిట్‌లో మదర్ హార్లిక్స్, ఖర్జూరా ప్యాకెట్, ఐరన్ సిరప్ బాటిళ్లు, నెయ్యి, పల్లిపట్టి ప్యాకెట్లు, ఒక కప్పు, ఒక బాస్కెట్‌లో పెట్టి అందించారు. రెండో కిట్‌లో బాస్కెట్‌కు బదులుగా బ్యాగులో పెట్టి వాటినే అందించారు. ఈ న్యూట్రిషన్ కిట్‌లతో గర్భిణులకు మేలు జరిగింది. ప్రస్తుతం జిల్లాలో 4,469 మంది గర్భిణులకు కిట్లు అందించాల్సి ఉండగా, జిల్లాలో ఒక్క కిట్ కూడా అందుబాటులో లేదు. కిట్లు అందుకోకుండానే వీరు ప్రసవం అయ్యే అవకాశం ఉంది.

నిల్వఉన్న కిట్లు పంపిణీ చేశాం..

కొంతకాలంగా న్యూట్రిషన్ కిట్ల సరఫరా నిలిచిపోయింది. అంతకు ముందు వచ్చిన కిట్లను గర్భిణులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి కిట్లు వస్తేనే మళ్లీ అందించే అవకాశం ఉంది.

– డాక్టర్ భీష్మ, మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంవో

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

ప్రజలకు భరోసా కల్పించాలి

- కేసుల విచారణ వేగవంతం చేయాలి
- ఎన్‌బీడబ్ల్యూ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డీసీపీ భాస్కర్
- పోలీస్ అధికారులతో నేర సమీక్ష



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: పోలీసులు ప్రజల భద్రతకు తామున్నామన్న భరోసా కల్పించాలని డీసీపీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీస్ అధికారులతో తన కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల వారీగా నేరాలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. పోలీస్ అంటే ప్రజల్లో భయం పోగొట్టాలన్నారు. ప్రజలతో మమేకమవుతూ పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెంచాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని తెలిపారు. బాధితులకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అని, నేరస్తులకు కాదని పేర్కొన్నారు. కేసుల విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసులు, రోజువారీగా వచ్చే పిటిషన్లపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. విచారణలో నేరస్తుడికి శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్ అధికారి బాధ్యతగా పని చేయాలని తెలిపారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మహిళలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో జాగ్రత్త వహించాలన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం ప్రజల మధ్య ఉండాలన్నారు. గంజాయి సరఫరా, నిల్వ, అమ్మకం, రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్‌బీడబ్ల్యూ కేసులపై ప్రత్యేదృష్టి పెట్టాలని సూచించారు. ప్రతీ పోలీస్ అధికారి క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్లు, రవికుమార్ జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆస్నాదలో రైతుల దీక్ష



పొలాల వద్ద దీక్ష చేపట్టిన రైతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో రైతులకు, అటవీశాఖ అధికారులకు మధ్య మంగళవారం వాగ్వాదం జరిగింది. 15 రోజులుగా ఫారెస్టు అధికారులు తమ భూములను లాక్కోవాలని చూస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పొలాల వద్ద టెంటు వేసుకుని దీక్ష చేపట్టారు. అటవీశాఖ అధికారులు వచ్చి ఫారెస్టు భూములని అనడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 60 ఏళ్లగా 582, 730 సర్వే నంబర్లలో భూములను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పట్టా పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అయినా ఫారెస్టు అధికారులు వచ్చి భూములు ఖాళీ చేయాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

కోణంపేట సబ్‌సెంటర్ తెరిపించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆఫీసర్ వెంకటేశ్వర్లు

నెన్నెల: మండలంలోని కోణంపేట సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది సక్రమంగా విధులకు హాజరుకాకపోవడంతో గ్రామస్తులు సోమవారం సెంటర్‌కు తాళం వేశారు. ఈవిషయం అన్ని పత్రికల్లో ప్రచురితమైంది. పత్రిక క్లిప్‌లను గ్రామానికి చెందిన రాంటెంకి శ్రీనివాస్ ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ, కలెక్టర్, ఎమ్మెల్యేకు ట్వీట్ చేశాడు. దీనికి వారు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి అనితను ఆదేశించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ వెంకటేశ్వర్లు నెన్నెల మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్ మంగళవారం కోణంపేట హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సబ్‌సెంటర్‌ను తెరిపించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. సమయపాలన పాటించకుండా విధులు నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. విధి నిర్వహణలో సిబ్బంది బయటకు వెళ్లాల్సివస్తే సబ్‌సెంటర్‌లో ఆశ కార్యకర్తను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇక ముందు సబ్‌సెంటర్ సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చేసినా తమకు నేరుగా సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. అందరూ స్పందించి గ్రామాన్ని సందర్శిస్తున్నా ఐసీడీఎస్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో అధికారులు కోణంపేటను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో అటెండర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు యువకులు శంకర్, శ్రీనివాస్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు..

నస్పూర్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వాహణ, వన మహోత్సవం, మహిళాశక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పనులు, పంటలసాగు, ఉద్యోగుల సాధారణ బదిలీలు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ధరణి పెండింగ్ సమస్యలపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా నిర్దేశించిన మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, డీఎంహెచ్‌వో అనిత, డీపీవో వెంకటేశ్వర్‌రావు, డీఈవో యాదయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై డీఎంహెచ్‌వోకు వినతి



జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనితకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం స్కీంను రక్షించి, తమను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనితను ఆశ వర్కర్లు కోరారు. ఈమేరకు మంగళవారం వినతిపత్రంను అందించారు. అనంతరం ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ కేంద్రం వైద్యరంగాన్ని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపి సంకీర్ణ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న దేశవ్యాప్తంగా కోర్కెల దినంను పాటించాలని సీఐటీయూ పిలుపు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలలో వంట సరుకులు చోరీ

దహెగాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట సరుకులు చోరీకి గురైనట్లు మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, వెంకటమ్మ, లక్ష్మి తెలిపారు. మంగళవారం పాఠశాలకు వెళ్లగా వంటగది తలుపులు పగులగొట్టి ఉన్నాయన్నారు. లోపలికి వెళ్లిచూడగా బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, తదితర సరుకులు మాయమైనట్లు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లేగదూడ మృతి

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని కుబిడె ఎర్రయ్యకు చెందిన లేగదూడ మృతి చెందింది. గ్రామంలోని ప్రధాన రహదారి నుండి మహారాష్ట్రకు వెళ్లే భారీ వాహనం లేగదూడను ఢీకొని ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

నలుగురిపై కేసు నమోదు

దహెగాం: పెన్సింగ్ పోల్స్ తొలగించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చిలువేరు మణికంఠ, క్రిష్టారెడ్డికి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఎకరం భూమి చుట్టూ సోమవారం పెన్సింగ్ పోల్స్ వేశారు. అదేరోజు రాత్రి మండల కేంద్రానికి చెందిన భూతే నాగరాజు, జునగరి గణపతి, మరో ఇద్దరు వాటిని తొలగించడంతో పాటు మణికంఠ తండ్రి కమలాకర్ వస్తే చంపేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు. కమలాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం సమీపంలోని గోదావరినదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభించిందని సీఐ బన్సీలాల్ తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లిచూడగా మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో కుళ్లిపోయి ఉందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. సమాచారం తెలిసినవారు 8712656534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అదుపుతప్పి బోల్తాపడిన కారు

తాండూర్: జాతీయ రహదారిపై అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తా పడిన ఘటన మంగళవారం తాండూర్‌లో చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు తాండూర్ మండలం రేపల్లెవాడ శివారులో డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆ వేగానికి కారు బెలూన్స్ తెరుచుకుని రోడ్డు కిందకు మూడు పల్టీలు కొట్టి ఓ ప్రైవేట్ స్కూల్ ప్రహరీ వద్ద ఆగింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. బెలూన్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

పిడుగుపాటుకు కాలిన ట్రాన్స్‌ఫార్మర్

చెన్నూర్: పట్టణంలోని బేతాళవాడకు చెందిన పెండ్యాల లింగయ్య పెరట్లో గల చింతచెట్టుపై పిడుగు పడడంతో సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో మంగళవారం మరమత్తులు చేసినట్లు కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ తెలిపారు.

గోరింటా పండింది..!

- ఆషాఢమాసం స్పెషల్..
- పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో మెహందీ వేడుకలు



ఆదిలాబాద్: చేతులకు గోరింటాకు చూపుతున్న మహిళలు



గోరింటాకు చూపుతున్న కేజీబీవీ విద్యార్థినులు

మంచిర్యాలఅర్బన్: ఆషాఢ మాసం వచ్చిందంటేనే గోరింటాకు గుర్తుకు వస్తుంది. మహిళలు, యువతులు, చిన్నారుల చేతులు గోరింటాకుతో కళకళలాడుతుంటాయి. ఒకరికొకరు పోటీపడి మరీ పెట్టుకుంటారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకుంటే రుతువు మారిన వేళ కాళ్లు, చేతులు, గోళ్లు శుభ్రపడుతాయని, రోగ నిరోధకంగా పనిచేయడంతో అంటువ్యాధులను కూడా దూరం చేస్తుందని నమ్మకం.

ఎర్రగా పండాలంటే..

గోరింటాకు ఎర్రగా పండాలంటే అందులో నిమ్మరసం కలపాలి. దీంతో పాటు గోరింటాకు రుబ్బేటప్పుడు రవ్వంత చింతపండు వేసినా మంచి ఉపయోగం ఉంటుంది. గోరింటాకు పెట్టుకున్న తర్వాత అది పూర్తిగా ఎండిపోయి రాలిపోయే స్థితిలోకి వచ్చాక తీసేయాలి. అలా తీసివేసిన వెంటనే చేతులను శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత చేతులకు కొద్దిగా నూనె రాస్తే గోరింటాకు మంచి కలర్‌లోకి వస్తుంది.

ఒంట్లోని వేడిని తగ్గించే ఔషధ గుణం..

గోరింటాకు ఒంట్లోని వేడిని తగ్గించే ఔషధ గుణం కలిగి ఉంటుంది. బయటి వాతావరణానికి అనుగుణంగా శరీరాన్ని కూడా చల్లబరిచి దోషాల బారిన పడకుండా శరీరానికి మేలు చేస్తుంది. ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్ల పుట్టింటికి చేరుకోవడం తరాల నుంచీ ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు మహిళలకు తమ సౌభాగాన్ని గుర్తు చేస్తుంది. గోరింట ఆకులే కాదు.. పూలు, వేళ్లు, బెరడు విత్తనాలు అన్నీ ఔషధయుక్తాలేనని నిపుణులు చెబుతున్నారు. కేజీబీవీతోపాటు పలు విద్యాసంస్థల్లో గోరింటాకు విశిష్టతను తెలిపేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉపాధి మార్గంగా ..

ఒకప్పుడు ఇంటిల్లిపాది గోరింటాకును ముద్దలుగా చేసి ఒకరి చేతికి మరొకరు అరచేయి, చేతివేళ్లు, కాళ్లకు పెట్టుకునే వారు. ఈ మాసంలో గోరింటాకుకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. అంతేకాకుండా వివాహాది శుభకార్యాలకు మెహందీగా వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దటానికి కొంతమందికి ఉపాధి మార్గంగా కూడా మారింది.



గోరింటాకు పెట్టుకుంటున్న కేజీబీవీ విద్యార్థినులు

మహిళల సంబరాలు

ఆషాఢమాసం పురస్కరించుకుని మంగళవారం పాత మంచిర్యాలలోని రామాలయంలో మహిళలు గోరింటాకు సంబరాలు నిర్వహించారు. లలితా పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని ఉల్లాసంగా గడిపారు.

హౌసింగ్ బోర్డ్ కాలనీలో వేడుకలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సోమవారం రాత్రి గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కాలనీకి చెందిన పలువురు మహిళలు అమ్మవారిని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు రాణి, విజయలక్ష్మి, మీనా, రజిని, రజిత, లావణ్య, సరోజ, మల్లీశ్వరి, మాలతి, తదితరులు ఉన్నారు.

మహిళలకు ప్రత్యేకం



ఆషాఢ మాసం మహిళలకు ప్రత్యేకం. ఈ మాసంలో నోములు, వ్రతాలతో పాటు వన భోజనాలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. ముఖ్యంగా సౌభాగ్యం కోసం గోరింటాకు పెట్టుకుని సంప్రదాయాలను గౌరవిస్తాం.

– బోలిశెట్టి సునీత, కౌన్సిలర్, మంచిర్యాల

గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం



ఆషాఢమాసం వచ్చిందంటే ముందుగా గుర్తుకు వచ్చేది గోరింటాకు. అందరం ఒకే చోట చేరి గోరింటాకు పెట్టుకోవటంతో పాటు గాజులు ఇచ్చిపుచ్చుకుంటాం. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకు పెట్టుకోవడం ఆనందంగా ఉంటుంది.

– కమటం సుజాత, పాత మంచిర్యాల

ఆరోగ్యానికి మంచిది



గోరింటాకు ఆరోగ్యానికి మంచిది. గోరింటాకు వేడుకలను ఏటా నిర్వహిస్తాం. సామూహికంగా పండుగ జరుపుకుంటాం. గోరింటాకుతో చర్మవ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చు. ఇది దొరకని వారు కోన్లను కొనుగోలు చేస్తుంటారు. మెహందీ కోన్లు కొనేముందు జాగ్రత్తగా పరిశీలించాలి.

– పానుగంటి వైష్ణవి, లలితా పారాయణ సేవా సభ్యురాలు

చిన్ననాటి నుంచీ..



ఆదిలాబాద్‌టౌన్: ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. నా చిన్నతనం నుంచి గోరింటాకు పెట్టుకుంటున్నా. గోరింటాకు తెంపి రోట్లో వేసి ముత్తయిదువలంతా కలిసి పాటలు పాడుతూ దంచుతారు. ఒకచోట చేరి సంబరాలు జరుపుకుంటాం.

– సంధ్య, ఓల్డ్ హౌజింగ్‌బోర్డు

సంస్కృతికి ప్రతీక



ఆదిలాబాద్‌టౌన్: ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక భాగంగా మారింది. వర్షాకాలంలో తడిస్తే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. అలా జరగకుండా గోరింటాకు శరీరానికి వెచ్చదనం ఇస్తూ వ్యాధులు రాకుండా కాపాడుతుంది.

– సరళ, ఆదిలాబాద్

అనాదిగా ప్రత్యేకత..



ఆదిలాబాద్‌టౌన్: గోరింటాకును గౌరింటాకు అని కూడా అంటారు. పూర్వకాలంలో పార్వతీదేవి చిన్నతనంలో ఉద్యానవనానికి వెళ్లినప్పుడు రక్తపుచుక్క గోరింటాకుపై పడుతుంది. అప్పటి నుంచి ఆ గోరింటాకు పెట్టుకుంటే చేతులు ఎర్రగా మారుతున్నాయని పూర్వీకులు చెబుతున్నారు.

– పోలా పారిజాత, హౌజింగ్‌బోర్డు

గౌరి ఇంటి ఆకు



ఆసిఫాబాద్ అర్బన్: గోరింటాకు అంటే గౌరి ఇంటి ఆకుగా భావిస్తారు. ఇంట్లో ఏ శుభకార్యమైనా మొదట గోరింటాకుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తారు. నేడు వివాహాలకు మూడు రోజుల ముందే ప్రత్యేకంగా మెహందీ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

– అఖిల, గృహిణి

ఆనవాయితీగా వస్తోంది



ఆసిఫాబాద్ అర్బన్: నాకు గోరింటాకు పెట్టుకోవడం చాలా ఇష్టం. ముఖ్యంగా ప్రతీ మహిళ ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు పెట్టుకుంటే పెళ్లికాని యువతులకు గుణవంతుడైన భర్త లభిస్తాడని నమ్ముతారు.

– కాసర్ల శ్రీదేవి, గృహిణి

రోగ నిరోధక శక్తి పెంచుతుంది



ఆసిఫాబాద్ అర్బన్:గోరింటాకుకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తి ఉంది. అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఆధ్యాత్మిక పరంగా గోరింటాకు సౌభాగ్యానికి ప్రతీక అని.. ఆషాడంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా సౌభాగ్యాన్ని పొందుతారని జోతిష్యులు పేర్కొంటున్నారు.

– నిమ్మకంటి కీర్తి, గృహిణి

కార్డుల విధానం ఉపసంహరించుకోవాలి

శ్రీరాంపూర్: రక్షణ పేరుతో యాజమాన్యం ప్రవేశపెట్టిన కార్డుల విధానాన్ని ఉపసంహరించుకోవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో అన్ని గనులపై నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్కే 6 గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మస్క సమ్మయ్య మాట్లాడుతూ సేఫ్టీ పేరుతో మైనింగ్ స్టాఫ్‌కు టెక్నికల్ స్టాఫ్‌కు ఎల్లో, రెడ్ కార్డులను జారీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికే పని భారంతో ఉద్యోగులు సతమతమవుతున్నారన్నారు. ఒకటి నుంచి మూడుసార్లు తప్పు చేస్తే ఎల్లో కార్డు విధానం, మళ్లీ తప్పు చేస్తే రెడ్ కార్డు విధానం అమలుచేసి ఉద్యోగులకు చార్జిషీట్లు, సస్పెండ్లు, ఇంక్రిమెంట్లలో కోత వంటి తీవ్రమైన చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జాయింట్ సెక్రటరీ రాచర్ల చంద్రమోహన్, కోశాధికారి నాగభూషణం, నాయకులు బాలకృష్ణ, అద్దు శ్రీనివాస్, శ్రీకాంత్, సంగం సదానందం, బేర రవీందర్, లక్ష్మణ్, దాడి రాజయ్య పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెండో రోజుకు చేరిన రిలే దీక్షలు

శ్రీరాంపూర్: తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. మంగళవారం ఈ దీక్షలకు ఆయూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలన్నీ సింగరేణికి చెందినవేనన్నారు. కేంద్రం తెలంగాణలోని నూతన బొగ్గు బ్లాక్‌లను వేలం ద్వారా ప్రైవేటు కంపెనీలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, జిల్లా కార్యదర్శి మేకల దాసు, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ కార్యదర్శులు రాంచందర్, నరసింహారావు, తిరుపతి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించేంత వరకు ఆందోళనలు ఆపేది లేదన్నారు. ఏరియాలోని కేకే-5 గనిపై సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ గోపాల్ మాట్లాడుతూ బుధవారం ఏరియా జీఎం కార్యాలయం వద్ద అన్ని యూనియన్ల ఆధ్వర్యంలో చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని కోరారు.



దీక్షలో పాల్గొన్న వాసిరెడ్డి సీతారామయ్య

కుమారుడి బారి నుంచి కాపాడండి..

వేమనపల్లి: కుమారుడి బారినుంచి కాపాడాలని బుయ్యారం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బైరి మల్లక్క, లస్మాగౌడ్ ఇటీవల నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్యాంపటేల్ మంగళవారం గ్రామానికి వెళ్లి విచారణ జరిపారు. ఈ సందర్భంగా తమ పెద్ద కుమారుడు బైరి వెంకాగౌడ్ పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నామని వృద్ధ దంపతులు మొరపెట్టుకున్నారు. అతని వాటా కింద రెండెకరాల భూమి పట్టా చేయించుకొమ్మని సంతకాలు పెడితే మూడెకరాలు చేయించుకున్నాడని, పైగా తమను, రెండో కొడుకు తిరుపతిగౌడ్ కుటుంబాన్ని గొడవలకు ఉసిగొలిపి కేసుల పాలు చేస్తున్నాడని వాపోయారు. తమను ఇంట్లోకి వెళ్లకుండా తాళం వేసుకున్నాడని వాపోయారు. తమ కుమారుడి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్సైని వేడుకున్నారు. వృద్ధ దంపతులతో పాటు గ్రామస్తుల వాంగ్మూలాన్ని ఎస్సై నమోదు చేసుకున్నారు.



విచారణ జరుపుతున్న ఎస్సై శ్యాంపటేల్

మహిళలకు ఉచిత శిక్షణ

జైపూర్: ఎస్టీపీపీ ప్రభావిత గ్రామాల్లోని మహిళలకు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్టీపీపీ జీఎం కె.శ్రీనివాసులు, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి తెలిపారు. కనీస విద్యార్హత ఏడోతరగతిగా నిర్ణయించామన్నారు. అర్హులైన మహిళలకు మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి గలవారు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రిపుల్‌ఐటీలో కొనసాగుతున్న కౌన్సెలింగ్



ఎంపికపత్రం అందజేస్తున్న అధికారులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపికైన విద్యార్థులకు రెండో రోజు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ గ్రామానికి చెందిన కోలన్ తనూజాకు మొదటి ఎంపికపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ బుధవారం కూడా కౌన్సెలింగ్ కొనసాగుతుందని, 1001 నుంచి 1404 వరకు ఉన్న విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ మహేశ్, జాయింట్ కన్వీనర్ పావని, రంజిత్‌కుమార్, డా.దత్తు, అడ్మిషన్ కమిటీ సభ్యులు హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ అకౌంట్లు

జైపూర్: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అకౌంట్లను అందించడానికి సింగరేణి అధికారులతో ఒప్పందం చేసుకున్నట్లు ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కింద ప్రతి కార్మికుడికి వేతనాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ద్వారా అందించడం జరుగుతుందని, ఏదైనా ప్రమాదం జరిగి కార్మికుడు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.20 లక్షల ప్రమాద బీమా చెల్లించడంతో పాటు వారి పిల్లల చదువులకు రూ.4 లక్షలు అందించనున్నట్లు తెలిపారు.

పీఆర్ ఎస్‌ఈగా జాదవ్ ప్రకాశ్



అభినందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

కైలాస్‌నగర్: పంచాయతీరాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్‌ఈ)గా జాదవ్ ప్రకాశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పని చేసిన ఎస్‌ఈ వెంకట్‌రావు పదవీ విరమణ పొందారు. మంచిర్యాల జిల్లా ఈఈ(టెక్నికల్)గా పనిచేస్తున్న ప్రకాశ్‌కు ఎస్‌ఈగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నియమించింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ప్రకాశ్‌కు ఈఈ రాథోడ్ శివరాం, డీఈ కుందన్ రాథోడ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలను తెలిపారు.

చీతా కన్నుమూత

- నేరస్తులను పట్టించడంలో ప్రత్యేక గుర్తింపు
- 16 కేసులు ఛేదించిన డాగ్‌స్క్వాడ్

జన్నారం: నేరస్తుల పాలిట సింహస్వప్నంగా, నిందితులను పట్టించడంలో సహాయకారిగా మారి రెండేళ్లలో 16 కేసులలో నిందితులను పట్టించడంలో ముఖ్యపాత్ర పోషించిన చీతా డాగ్‌స్క్వాడ్ అనారోగ్యంతో కన్నుమూసింది. కొన్ని నెలలుగా వయసురీత్యా అనారోగ్యం పాలుకావడంతో సిబ్బంది ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 8న రాత్రి గుండెపోటుకు గురికావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కళేబరాన్ని ఖననం చేసినట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

2018 మార్చి నుంచి డిసెంబర్ వరకు

కవ్వాల్ టైగర్‌జోన్‌లో వేట, స్మగ్లింగ్ నిరోధానికి నిందితులను పట్టుకోవడంలో సహకరించేందుకు అటవీశాఖకు జాగిలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో 2018 మార్చి 15న మధ్యప్రదేశ్‌లోని గ్యాలియర్‌లో ఉన్న బీఎస్ఎఫ్ శిక్షణ కేంద్రంలో చీతాతో పాటుగా జన్నారం అటవీ డివిజన్‌కు చెందిన సత్యనారాయణ, శ్రీనివాస్ అనే బీట్ అధికారులకు కూడా తొమ్మిది నెలల పాటు శిక్షణ ఇచ్చారు. డిసెంబర్ 15న శిక్షణ ముగిసిన అనంతరం చీతాను జన్నారం డివిజన్‌కు తీసుకొచ్చారు.

నిందితులను పట్టుకోవడంలో కీలకం

కవ్వాల్ టైగర్‌జోన్‌లో 2019 జనవరి నుంచి 2020 డిసెంబర్ వరకు 16 కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో చీతా కీలకంగా మారింది. 2019 జనవరిలో ఆర్మూర్‌లో చిరుతపులిని హతమార్చిన కేసులో చీతాను తీసుకెళ్లగా చెప్పుల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. మంచిర్యాలలో చిరుతను హతమార్చిన నిందితులను పట్టుకోవడంలో కీలకంగా మారింది. 2019 మేలో జన్నారం అటవీ డివిజన్‌లో చుక్కల దుప్పిని హతమార్చిన బొమ్మెనకు చెందిన నిందితులను పట్టిచ్చింది. 2020లో తాళ్లపేట రేంజ్ రాజుగూడలో సాంబర్‌ను, దమ్మన్నపేటలో అడవి అలుగును హతమార్చిన నిందితులను పట్టిచ్చింది. వీటితో పాటు స్మగ్లింగ్ చేసే వారిని, అక్రమంగా నిలువ ఉంచిన కలపను కూడా పట్టుకుని అధికారులకు సహాయకారిగా నిలిచింది.



చీతా (ఫైల్)

బాధగా ఉంది

2018లో 9 నెలల శిక్షణ అనంతరం దేశవ్యాప్తంగా 12 డాగ్‌స్క్వాడ్‌లను ఇచ్చారు. వాటిలో అన్నీ అనారోగ్యంతో మృతి చెందాయి. ఇన్ని రోజులు చీతాతో నాకు చాలా అటాచ్‌మెంట్ ఉండేది. తన బాగోగులు, తిండి, స్నానం వంటివి చూసుకునేవాడిని. చీతాతో మంచి బంధం ఏర్పడింది. ఈ క్రమంలో చీతా అనారోగ్యంతో మృతి చెందడం బాధగా ఉంది.

– శ్రీనివాస్, డాగ్‌స్క్వాడ్ బీట్ అధికారి

ఆర్టీసీ త్రైమాసిక పురస్కారాలు

ఆదిలాబాద్: ఆర్టీసీ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు సంస్థ ఆర్ఎం సోలోమన్, డీఎస్పీ జీవన్‌రెడ్డితో కలిసి ప్రగతిచక్రం త్రైమాసిక పురస్కారాలు అందించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి నగదు పురస్కారాలతో పాటు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికుల రక్షణే పరమావధిగా సేవలందించాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందులో భాగంగా పురస్కారాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే గతేడాది అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన లక్కీ డ్రా విజేతలకు రూ.9,900 నగదు పురస్కారం అందించారు. ఇందులో డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, డిపో మేనేజర్ కల్పన తదితరులున్నారు.



నగదు పురస్కార గ్రహీతలతో డీఎస్పీ, ఆర్ఎం

అంబర్ ప్యాకెట్లు పట్టివేత

దండేపల్లి: మండలంలోని చెల్కగూడ వద్ద వ్యాన్‌లో తరలిస్తున్న అంబర్ ప్యాకెట్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. చెల్కగూడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా జన్నారం వైపు నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న వ్యానును తనిఖీ చేయగా అందులో 26 కేజీల బరువుతో ఉన్న 24 అంబర్ ప్యాకెట్ బ్యాగులు లభ్యమయ్యాయన్నారు. వాటివిలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందన్నారు. అంబర్ ప్యాకెట్ బ్యాగులతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జన్నారం మండలం లక్ష్మీపూర్ తండాకు చెందిన బోడ మోహన్, బంగారి తండాకు చెందిన బనవాత్ సంతోష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



అంబర్ ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఎస్సై ఉదయ్‌కిరణ్

